



● చెరువులో మట్టి లేఅవుట్లకు...

నెల్లూరు రూరల్ మండలం నెల్లూరు చెరువు, కలివెలపాలెం చెరువుల్లో అక్రమార్కులు భారీగా గుంతలు తవ్వుతూ ఆ మట్టిని లేఅవుట్లకు అమ్ముకుంటున్నారు. నెల్లూరు చెరువు నుంచి పొట్టేపాలెంకు చెందిన ఓ టీడీపీ నేత, కలివేలపాలెం చెరువు నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టి తవ్వకాలు చేస్తున్నారు. వీటిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. చెరువుల్లో మట్టి ఎత్తితే సస్పెండ్ చేస్తానని ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. దీంతో మరోమారు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. ఈ క్రమంలో ఇప్పుడు రాత్రివేళల్లో ఈ చెరువుల మట్టిని కొల్లగొడుతున్నారు. ఇక పెన్నానది నుంచి రాత్రిళ్లు దొంగచాటుగా ట్రాక్టర్లతో ఇసుకను తవ్వుకెళుతున్నారు. పొట్టేపాలెం, కోడూరుపాడు, పెన్నా బ్రిడ్జి దిగువ ప్రాంతాల్లో కూడా రాత్రివేళల్లో తవ్వకాలు జరుగుతున్నాయి.

పొట్టెపాలెం చెరువులో గ్రావెల్ తవ్వగా ఏర్పడిన గుంతలు

వెంటాడుతున్న పాపం

- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా
- బావులుగా మారిన వాగులు, వంకలు
- రూపు కోల్పోయిన చెరువులు
- అధికారమే అండగా దోపిడీ

నాటి నిర్వాకమే నేటి కొరతకు కారణం

నెల్లూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం ప్రజలను ఇంకా వెంటాడుతూనే ఉంది. ఊరిపక్కన ఏట్లో ఉచితంగా దొరికే ఇసుకను గంపగుత్తగా అస్మదీయ కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వాగులు బావులుగా మారా యి. అడ్డూఅపూ లేక ఇసుక రీచ్‌ల్లో తవ్వేయడంతో పర్యావరణానికి పెనుముప్పు ఏర్పడింది. దీంతో సర్వోన్నత న్యాయస్థానం ఇసుక తవ్వకా లపై ఆంక్షలు విధించింది. పర్యావరణశాఖ అనుమతి లేనిదే ఇసుక తవ్వకానికి వీలులేదని ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానాల ఆక్షేపణ లు ఓ వైపు, విపరీతంగా తవ్వేసిన కారణంగా పర్యావరణశాఖ అనుమతి లభించక మరోవైపు... ఈ రెండు కారణాలు ఇసుక సంక్షోభాన్ని సృష్టించా యి. ఈ పరిస్థితులు ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని నిర్ణయిం చుకున్న కూటమి ప్రభుత్వాన్ని నిస్సహాయ స్థితికి నెట్టేశాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను ఎంతోకొంత తీర్చాలన్న ఉద్దేశంతో నెల్లూరు, సంగం బ్యారేజీల్లో డీసిల్టేషన్ పేరుతో డ్రెడ్జింగ్ పద్ధతి ద్వారా ఇసుకను వెలికితీస్తున్నది. ఈనెల 19 (నేటి) నుంచి ఇసుక ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటోంది. ఇదంతా నాణేనికి ఒక వైపే...! మరో వైపు... ఇసుక కొరతను ఆదాయ మార్గంగా ఎంచుకొన్న కొన్ని రాజకీయ శక్తులు అక్రమ రవాణాకు తెరలేపాయి. అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని కొందరు, ప్రతిపక్ష నేతలతో కలిసి కొన్నిచోట్ల రాత్రి సమయాల్లో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. భారీగా రేట్లు పెంచి ప్రజల రక్తం పిండుకుంటున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ. 2,500లకు దొరికేది. అక్రమార్కులు ఇప్పుడు రూ.9వేలకు విక్రయిస్తున్నారు. గతంలో టిప్పర్ ఇసుక రూ. 17వేలు. కానీ ఇప్పుడు బ్లాక్ మార్కెట్‌లో టిప్పర్ ఇసుక రూ. 45వేలకు అమ్ముతున్నారు. ఇలా ఇసుక విక్రయాల ద్వారా ప్రతిరోజు లక్షలకు లక్షలు పోగు చేసుకొంటున్నారు. అక్కడా.. ఇక్కడా.... అని కాదు..జిల్లా వ్యాప్తంగా ఇదేతరహా దోపిడీ సాగుతోంది. ఈ వ్యవహారంలో అధికార పార్టీనేతలకు కొంతమంది అధికారులు వంతపాడటం విశేషం.



ఉదయగిరి రూరల్ : దుత్తలూరు మండలం నందిపాడు సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

అల్లూరు, కొండాపురం మండలాల్లో దోపిడీ

కావలి : ప్రాంతంలో ఇసుక రీచ్‌లు లేకపోవటంతో నిర్మాణాల కోసం స్థానికంగా ఉన్న వాగులు, వంకల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అల్లూరు, కొండాపురం మండలాల్లో మాత్రమే కొంతమంది రాజకీయ నాయకులకు ఇసుక రవాణాతో సంబంధాలు ఉన్నాయి. కావలికి కందుకూరు నియోజకవర్గ పరిధిలోని మన్నేరు, ఉప్పుటేరు వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అయితే అక్కడ పోలీసులు దాడులు చేస్తుండటంతో రవాణా కష్టతరంగా మారింది. కాగా అల్లూరు, కొండాపురం మండలాల్లో టీడీపీ, వైసీపీ నాయకులు ఇసుకను అక్రమంగా వాగుల నుంచి తీసుకువచ్చి అమ్ముతుండగా వారికి పోలీసులు సహకరిస్తున్నారు. ఇకపోతే బోగోలు, జలదంకి , కలిగిరి మండలాల్లో ఎక్కడా పెద్దగా వాగులు లేక పోవటంతో ఇసుక అక్రమ రవాణా జరగడం లేదు. ఒక్క బోగోలు మండలంలో వేస్తున్న లేఅవుట్‌కు మాత్రం స్థానిక టీడీపీ నాయకుడి సహకారంతో గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



కావలి : పెదపవని రోడ్డులో వస్తున్న ఇసుక ట్రాక్టర్

కందుకూరులో జోరుగా అక్రమ రవాణా

కందుకూరు : నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రవాణాదారులు మారారే తప్ప వ్యవహారం మారలేదు. సెబ్ రద్దవుతుండటంతో మాకు పట్టదన్నట్లుగా సెబ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. పోలీసులు అస్మదీయులకు రైట్‌రైట్ అంటూ సామాన్యులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. వివిధ మండలాల్లోని అధికార పార్టీ నేతల అండతో ఐదారు ట్రాక్టర్లతో రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కొద్దిరోజులు సామాన్యులకు ట్రాక్టరు ఇసుక రూ. 2 వేలకే లభించగా, ప్రస్తుతం ఇసుకాసురులు సిండికేట్ ఏర్పడటంతో ట్రక్కు ధర రూ. 3,500కి చేరింది. మొగిలిచర్ల, వీఆర్‌కోట, అన్నెబోయినపల్లి, దప్పళంపాడు, మాచవరం, భీమవరం, మన్నేటికోట తదితర ప్రాంతాల నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అలాగే పాలేరులో విక్కిరాలపేట, పలుకూరు తదితర ప్రాంతాల నుంచి కూడా అక్రమ రవాణా సాగుతోంది. మరోవైపు మట్టి మాఫియా కూడా ప్రభుత్వ భూములు, చెరువులు, దేవదాయ శాఖ భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తే కిందిస్థాయి సిబ్బందిని బలిచేసి చేతులు దులుపుకోవడం తప్ప జిల్లా అధికారులు ఏమీచేయపోతున్నారు.



ఉలవపాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన మట్టి మాఫియా డంప్ చేసిన గ్రావెల్

నేతలకు ఎమ్మెల్యే కాకర్ల హెచ్చరికలు ?

ఉదయగిరి రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొంతమంది వైసీపీ నేతలు అధికార పార్టీ నాయకులతో చేతులు కలిపి మట్టి, ఇసుక, గ్రావెల్‌ను దోచుకుంటున్నారు. రెండు నెలల క్రితం దుత్తలూరు సమీపంలో ఓ వైసీపీ నాయకుడు అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా, పోలీసులు వాహనాలను సీజ్ చేశారు. అనంతరం అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో వదిలేశారు. అలాగే నందిపాడులో అధికార పార్టీకి చెందిన నాయకుడు మట్టి, ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. వరికుంటపాడు మండలం కనియంపాడు, తూర్పుబోయమడగల, గణేశ్వరాపురం, తూర్పుచెన్నంపల్లి గ్రామాల సమీపంలో ఉన్న వాగుల నుంచి యథేచ్ఛగా పల్లెలకు ఇసుక తరలిస్తున్నారు. ఉదయగిరి మండలం అప్పసముద్రం, తిరుమలాపురం, అన్నంపల్లి ప్రాంతాల నుంచి కూడా ఇసుక తరలిస్తున్నారు. ఇటీవల చోటుచేసుకొన్న కొన్ని పరిణామాల దృష్ట్యా మట్టి, ఇసుక అక్రమ తరలింపుపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సైతం నాయకులను తీవ్రస్థాయిలో హెచ్చరించారని సమాచారం.

నేటి నుంచి ఇసుక విక్రయాలు

జిల్లాలోని డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన స్టాక్ యార్డుల్లో గురువారం నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభం కానున్నాయి. సీఎం చంద్రబాబు రాష్ట్ర స్థాయిలో ఈ పాలసీను ప్రారంభించనున్నారు. ఆ తరువాత నుంచి ఇసుక బుకింగ్‌లు మొదలుకానున్నాయి. రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ఇసుక కొరతను తీర్చేందుకు ప్రభుత్వం డీసిల్టేషన్‌ను మొదలుపెట్టింది. సంగం బ్యారేజీ ఎగువున సంగం, సూరాయపాలెం వద్ద, నెల్లూరు బ్యారేజీ ఎగువున పోతిరెడ్డిపాలెం వద్ద డీసిల్టేషన్ జరుగుతోంది. అక్కడి నుంచి బోట్ల ద్వారా ఇసుకను సమీపంలో ఏర్పాటు చేసిన యార్డులకు తరలిస్తున్నారు. గడిచిన రెండు వారాలుగా ఈ మూడు పాయింట్ల వద్ద డీసిల్టేషన్ జరుగుతుండగా ఇప్పటి వరకూ 23 వేల టన్నుల ఇసుకను వెలికితీశారు. ప్రస్తుతం రోజుకు 1500 మెట్రిక్ టన్నుల ఇసుకను తెస్తున్నారు. ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేకుండా కేవలం తవ్వకాల చార్జీలు, రవాణా చార్జీలు, సీనరైజ్ చార్జీలు, మెయింటెనెన్స్ చార్జీలను మాత్రమే వసూలు చేయనున్నారు. వీటన్నింటిని కలుపుకొని టన్ను ఇసుక ధర రూ.380గా జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించింది. అంతకుమించి వసూలు చేయడానికి వీల్లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. మైనింగ్ శాఖ వద్ద ఎంపానెల్ అయిన వాహనాలు మాత్రమే ఇసుక రవాణా చేసేందుకు అవకాశం కల్పించారు. కాగా ఇసుకను ప్రభుత్వ పనిదినాల్లో ఏపీ శాండ్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సచివాలయాల ద్వారా కూడా బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. అయితే పేమెంట్లు మాత్రం అంతా ఆన్‌లైన్ ద్వారానే చేయాల్సి ఉంటుంది. బుక్ చేసుకున్న మరుసటి రోజున ఇసుకను తీసుకెళ్లవచ్చు. ఒకవేళ వినియోగదారునికి వాహనం లేకపోతే ప్రభుత్వమే నేరుగా డోర్ డెలివరీ చేస్తుంది.

భద్రతపై భరోసా

- సోమశిలలో అత్యవసర పనులకు నిధులు
- గేట్లు, రోప్‌ల మరమ్మతులకు రూ.2.42 కోట్లు మంజూరు

నెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రాజెక్టు వద్ద అత్యవసర పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి రూ.2.42 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రోప్‌ల ఏర్పాటుతోపాటు లీకేజీ గేట్లకు మరమ్మతులు చేసేందుకుగానూ ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలానే ఈ నిధులతో ఉపయోగంలేని రివర్స్ స్లూయిజ్‌ను కూడా మూసివేయనున్నారు.

2019, 2020, 2021 సంవత్సరాల్లో వచ్చిన భారీ వరదలకు సోమశిల ప్రమాదంలో పడింది. రోప్స్, గేట్ల నిర్వహణ సరిగా లేకపోవడం చాలా ఇబ్బందిగా మారింది. అత్యవసర సమయంలో ఇవి మొరాయించాయి. 11వ నెంబరు గేటు అయితే అసలు లేవలేదు. కనీసం గ్రీజు కూడా పూసే దిక్కు లేకపోవడంతో రోప్‌లు బాగా దెబ్బతిన్నాయి. వాటన్నింటినీ మార్చి వాటి స్థానంలో కొత్త రోప్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే సమయంలో గేట్లకు సంబంధించి నిర్వహణ లేకపోవడంతో లీకేజీ అవుతున్నాయి. ఈ నిర్వహణ పనులు అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది. మళ్లీ భారీ వరద వస్తే జలాశయం మనుగడ ప్రమాదంలో పడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వస్తోంది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తొలి ప్రాజెక్టు సందర్శన కూడా సోమశిలనే కావడం విశేషం. గత నెలలో సోమశిల జలాశయాన్ని ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఆప్రాన్ పనులు పూర్తి చేయడంతోపాటు రోప్‌లు, గేట్ల నిర్వహణ అత్యవసరంగా చేయాలని అధికారులు సూచించారు. దీంతో వెంటనే ఈ పనులు చేపడతామని సీఎం ప్రకటించారు. ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు అత్యవసర పనులకు అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం వీటికి అనుమతులిస్తూ రూ.2.42 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా సోమశిల ఎస్ఈ రమణారెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సోమశిలలో అత్యవసరమైన రోప్‌లు, గేట్ల మరమ్మతుల పనులను వెంటనే చేపడతామని చెప్పారు.



జలాశయం వద్ద క్రేన్‌ల సహాయంతో పనులు చేస్తున్న అధికారులు

స్లూయిస్‌లో లీకేజీల కట్టడికి చర్యలు

అనంతసాగరం : సోమశిల వద్ద స్లూయిస్‌లో కొనసాగుతున్న లీకేజీల కట్టడిపై అధికారులు చర్యలు చేపట్టారు. లీకేజీ నీరుతో అప్రాన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. ప్రొటెక్షన్ వాల్ పనులు పూర్తి చేయాలంటే లీకేజీలు అరికట్టక తప్పనిసరి. దీంతో ఆ దిశగా అధికారులు దృష్టిసారించి, విశాఖ నుంచి నిపుణుల బృందాన్ని పిలిపించి రెండురోజులుగా పనులు చేపడుతున్నారు. 95 శాతం లీకేజీలను అరికట్టడంతో ఇక ప్రొటెక్షన్ వాల్ పనులకు అడ్డంకి తొలగింది. ఈ క్రమంలో అప్రాన్ పనులు వేగంగా సాగను న్నాయి.

సీఆర్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోండి

● కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం, సెప్టెంబరు 18: దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, పునరావాస కల్పన, సాధికారత సమ్మిళిత ప్రాంతీయ కేంద్రాన్ని (సీఆర్‌సీ) దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని మానసికంగా దృఢంగా తయారు కావాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. చవటపాళెం పంచాయతీ అనుపల్లిపాడు సమీపంలోని సీఆర్‌సీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. దివ్యాంగులు తమ నైపుణ్యాలతో తయారు చేసిన వివిధ వస్తువులను పరిశీలించారు. ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు శిక్షణ, టైలరింగ్ మొదలైన వృత్తి నైపుణ్యాల వివరాలను తెలుసుకున్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉన్న ఈ కేంద్రాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారిని గుర్తించడం, మండలాలవారీగా అవగాహన సదస్సులు నిర్వహించి దివ్యాంగులను ఎంపిక చేసి ఈ కేంద్రంలో వారికి వివిధ వృత్తి నైపుణ్య కోర్సులను నేర్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రానికి బస్సు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినయ్‌కుమార్, సీఆర్‌సీ ఇన్‌చార్జి డైరెక్టర్ రామాంజులు, శిక్షకులు దేవీప్రియ, శ్రీనివాసులు, మల్లికార్జున్, రమేష్, కృష్ణ ఉన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ బదిలీ

ఒంగోలుకు బాలాంజనేయులు



నెల్లూరు(హరనాథపురం)8: స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఏ బాలాంజనేయులు ను ఒంగోలు రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అలాగే నెల్లూరులో మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీఆర్ హరివర్మను అన్నమయ్యజిల్లా రాయచోటి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన స్థానంలో జిల్లా మార్కెట్ వాల్యూ, ఆడిట్ రిజిస్ట్రార్‌గా విజయనగరం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఏవీ కుమారిని నియమించారు.

మాజీ మంత్రి అనీల్ పీఏ సస్పెన్షన్

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 18 : మాజీ మంత్రి, పీ అనీల్‌కుమార్‌యాదవ్ పీఏ(పర్సనల్ అసిస్టెంట్)గా పనిచేసిన నెల్లూరు మార్కెట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ షేక్ అఫ్సర్‌ను సస్పెండ్ చేస్తూ విజయవాడ మార్కెటింగ్‌శాఖ జేడీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అఫ్సర్ నెల్లూరు ఏసీ కూరగాయల మార్కెట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనీల్ పీఏగా ఆయన్ను నియమించుకున్నారు. అయితే గత ఎన్నికలప్పుడు కోడ్ అమలులో ఉండగా ఆయన మార్కెటింగ్‌శాఖలో విధులకు హాజరు కాలేదు. పైగా అనారోగ్య కారణంతో సెలవు పెట్టారు. అదే సమయంలో నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న అనీల్‌కుమార్‌యాదవ్‌కు అనుకూలంగా ప్రచారం నిర్వహించినట్లు అఫ్సర్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై నెల్లూరు నగర నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి ఈసీకి ఫిర్యాదులు కూడా అందాయి. అంతే కాకుండా మార్కెట్‌లోని దుకాణాలను అద్దెకు ఇప్పిస్తానని కొంతమంది వద్ద నగదు వసూళ్లకు పాల్పడినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు అఫ్సర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కాకాణి

- నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడిగా ఆదాల
- నెల్లూరు సిటీ, రూరల్ సమన్వయకర్తల నియామకం
- కార్పొరేషన్ పరిశీలకుడిగా అనీల్

నెల్లూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): కందుకూరుతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. అంతకుముందు బుధవారం సాయంత్రం తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో జిల్లా వైసీపీ నాయకులతో జగన్ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు పరిధిలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలు, కందుకూరు నియోజకవర్గాలతో మొత్తం 11 అసెంబ్లీ నియోజకవర్గాలతో కూడిన ఉమ్మడి నెల్లూరు జిల్లాకు అధ్యక్షుడిగా కాకాణిని నియమించారు. దీంతో కాకాణి మూడోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినట్లు అయింది.

ఇక నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడిగా ఆదాల ప్రభాకర్ రెడ్డిని నియమించారు. నెల్లూరు నగర సమన్వయకర్తగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సమన్వయకర్తగా ఆనం విజయ కుమార్‌రెడ్డిలను నియమించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిశీలకుడిగా నెల్లూరు నగర మాజీ ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్‌ను నియమించారు. రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మొన్నటి ఎన్నికల్లో వైసీపీ నగర అభ్యర్థిగా పోటీ చేసిన మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌ను నియమించారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగి నెల్లూరు సిటీలో మూడో నియోజకవర్గం ఏర్పాటైతే ఆ స్థానం నుంచి అనీల్ పోటీ చేస్తారని జగన్ ప్రకటించినట్లు జిల్లా అధ్యక్షుడు కాకాణి తెలిపారు. జిల్లా పరిధిలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలకు గత ఎన్నికల్లో పోటీ చేసినవారే ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారు.



ఏ బ్రాండూ లేదు..!

- మందే లేదని తేల్చిచెబుతున్న సిబ్బంది
- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నో స్టాక్
- ఉన్న సరుకు బార్లు, బెల్టు షాపులకు తరలింపు
- విధులకు హాజరుకాకుండా కాలయాపన

నెల్లూరు (క్రైం) సెప్టెంబరు 18: రాష్ట్రంలో నూతన మద్యం పాలసీని అక్టోబరు ఒకటి నుంచి కూటమి ప్రభుత్వం అమలు చేయనున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి, పాత పద్ధతిలో ఏర్పాటు చేయనున్నది. ఈ క్రమంలో ఇక మద్యం దుకాణాలు ఉండేది తక్కువ రోజులులేనని భావిస్తూ అక్కడున్న సిబ్బంది చేతివాటం చూపుతున్నారు.

● కొద్దిరోజులుగా నో స్టాక్

జిల్లాలో 160కుపైగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు, ఎలైట్లలో కొద్దిరోజులుగా మద్యం దొరకడంలేదు.ఏ సమయంలో మందుబాబులు వెళ్లినా తమకు కావాల్సిన బ్రాండ్లు లేవని దుకాణాల్లో సిబ్బంది చెబుతున్నారు. మద్యం కావాలని మందుబాబులు కోరుతుంటే ఇదిగో..డిస్‌ప్లేలో పెట్టిన బ్రాండ్లు మాత్రమే మా దగ్గర ఉన్నాయి. బీర్లు అసలే లేవు... అంటూ సమాధానం ఇస్తున్నారు. ఏమీ లేనప్పుడు దుకాణాలు మూసేస్తే సరిపోతుంది కదా... అంటూ మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ షాపులు ఉండేది ఈనెలాఖరు వరకు మాత్రమే. అందుకే పైనుంచి అధికారులు పెద్దగా బ్రాండ్లు పంపించడం లేదని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో మందుబాబులు చేసేది లేక బార్లకు వెళ్లి అధిక ధరలు చెల్లించి మద్యం కొనుగోలు చేస్తున్నారు.

● బార్లు, బెల్టుకు సరుకు తరలింపు

ప్రభుత్వ దుకాణాల్లో మద్యం కొరతపై జిల్లా ఎక్సైజ్ ఈఎస్‌ను వివరణ కోరగా అలాంటిది ఏమి లేదని, దుకాణాలకు పూర్తిస్థాయిలో సరుకు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ సమాధానాన్ని బట్టి చూస్తుంటే ఎలాగో ఉద్యోగాలు ఉండేది మరో 12 రోజులేగా.. అని భావిస్తున్న దుకాణాల్లోని సిబ్బంది నేరుగా దందాకు దిగినట్లు తెలుస్తోంది. బీర్లు, బాగా డిమాండ్ ఉన్న బ్రాండ్ల మద్యాన్ని బార్లకు, బెల్టు దుకాణాలకు తరలిస్తున్నారు. క్వార్టర్ బాటిల్ ఎమ్మార్పీపై రూ.10 నుంచి రూ.30 అదనంగా తీసుకొని అప్పగిస్తున్నట్లు తెలిసింది. ఇక దుకాణాల్లోని సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఇబ్బంది కరంగా ఉంటున్నదని, నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. వారు విధుల్లో ఉండాల్సిన సమయంలో అనుమతి కూడా తీసుకోకుండా బయట తిరుగుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.



నెల్లూరు : మద్రాసు బస్టాండ్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద కొనుగోలుదారులు

దుకాణాలకు మద్యం పంపుతున్నాం



మద్యం దుకాణాలకు ఇండెంట్ ప్రకారం డిపో నుంచి మద్యం సరఫరా చేస్తూనే ఉన్నాం. దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేయిస్తూ నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

- నాగమల్లేశ్వరరెడ్డి, ఎక్సైజ్ ఈఎస్

మొక్కలు నాటుదాం.. పుడమిని కాపాడుకుందాం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 18: మొక్కలు నాటి పుడమితల్లిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇన్‌చార్జి ఎంపీడీవో సంధాలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రెండోరోజు కూటమి నాయకులతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిఒక్కరు అమ్మ పేరుతో ఓ మొక్క నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, టీడీపీ, బీజేపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, సుబ్బారెడ్డి, చుండి హరిగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరిలో: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో రెండోరోజైన బుధవారం మండలంలోని గండిపాళెం, గడినరవ గ్రామాల్లో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టి వాయు కాలుష్యాన్ని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి అమర్నాధ్‌రెడ్డి, ఉపాధి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎంపీడీవో, కూటమి నాయకులు

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేవప్రసన్న

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: మండల ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జిల్లా పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఓబులాపురం దేవప్రసన్నకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబులాపురం కొండలరావు, చేవూరి బాబు, చేవూరి సైమన్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు ఎస్‌ఐగా రఘునాథ్

వరికుంటపాడు, సెప్టెంబరు 18: వరికుంటపాడు ఎస్‌ఐగా ఎం రఘునాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపి స్వాగతం పలికారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: గత వైసీపీ ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని ప్రవేశపట్టి ఆటో కార్మికులపై కేసులు బనాయించి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిందని, కూటమి ప్రభుత్వమైనా ఆటో కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిశోర్ కోరారు. బుధవారం ఉదయగిరి పట్టణంలో ఆటో కార్మికులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత వాహనాలు ఉన్న వారు చాలా తక్కువగా ఉన్నారని, ప్రభుత్వం ఆటో కార్మికులకు 50 శాతం సబ్సిడీతో ఆటోలు పంపిణీ చేయాలన్నారు. డీజల్‌కు సైతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఉదయగిరి మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యజమానులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల అందచేత

ఆత్మకూరు, సెప్టెంబరు 18: ఆత్మకూరు పట్టణంలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం విజయవాడ వరద బాధితుల సహాయార్థం బుధవారం రూ. 67,957 విరాళం అందచేశారు. ఈ విరాళాన్ని డిప్యూటీ విద్యాశాఖాధికారి గోపాల్ సమక్షంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ రామమోహన్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్ అమరావతిలకు అందచేశారు. ఈ మొత్తాన్ని జిల్లా ఆపస్మా ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు అందచేసిన వరద సహాయాన్ని పాఠశాల కరస్పాండెంట్‌కు అందచేస్తున్న ఉపాధ్యాయులు

సృజనాత్మక విద్యనందించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: విద్యార్థులకు సృజనాత్మక విద్యనందించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గడ్డంవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న సముదాయ సమావేశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చర్చించుకుని బోధనోపకరణాలతో విద్యార్థులకు విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి : ఏపీవో

సీతారామపురం : ఉపాధి హామీ పథకం కింద మండలంలో పనిచేస్తున్న గ్రామీణ ప్రాంత కూలీలకు రోజువారీ వేతనం రూ.300 వచ్చేలా పనిచేయించాలని ఏపీవో సుభాషిణి సిబ్బందికి సూచించారు. మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు.

ప్రపంచ రికార్డుపై హర్షం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: గతనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రూ.4,500 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులకు తీర్మానం చేయడంపట్ల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ చేతుల మీదుగా ధ్రువపత్రం అందుకోవడం పట్ల బుధవారం మండలంలోని గండిపాళెం గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్నాథ్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఇమ్రాన్, రెడ్డిబత్తిన సునీల్, రాయపాటి పీరావలి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు

వింజమూరు, సెప్టెంబరు 18 : మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19వ తేదీ నుంచి 21 వరకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు జరుగుతాయని పీడీ ప్రభాకర్‌రెడ్డి మాచర్ల తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19వ తేదీ అండర్-14, అండర్-17 బాలబాలికలకు అథ్లెటిక్స్‌లో, 20న అండర్-14, అండర్-17 బాల బాలికలకు కబడ్డీ, యోగా, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్‌లలో, 21న అండర్- 14, అండర్ - 17 బాలబాలికలకు వాలీబాల్, చెస్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించబడునని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

జీపునకు వేలంపాట

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయానికి చెందిన పాత జీపుకు బుధవారం సీడీపీవో పచ్చవ లావణ్య ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఏడుగురు పాల్గొనగా రూ.8,700కు గిరి అనే వ్యక్తి వేలంపాట పాడి జీపును దక్కించుకున్నాడు.

ఉపాధి పనులలో ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించండి

ఏఎస్ పేట, సెప్టెంబరు 18: ఉపాధి హామీ పనులలో ఎస్సీ, ఎస్టీ అబ్ధిదారులను ప్రోత్సహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన చిరమన గ్రామంలో చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలించారు. ప్రతిఒక్కరూ జాబ్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు. హార్టికల్చర్‌క్రింద మొక్కల పెంపకంచేస్తే ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు సతీష్, చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరు, సెప్టెంబరు 18: ఉపాధి హామీ పథకం లక్ష్యాల సాధనకు సిబ్బంది, క్షేత్రసహాయకులు కృషి చేయాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధి సిబ్బంది, క్షేత్రసహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంతోపాటు రూ. 300 కూలి గిట్టుబాటు అయ్యేవిధంగా కొలతల ప్రకారం వారికి పనిచేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, ఈసీ, టీఏ, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 18: వరి పంట సాగులో తగు సస్యరక్షణ చర్యలు చేపడితేపెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి అంజనేయుల నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అప్పసముద్రం, గుడినరవ, నేలటూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటకు ఆకుముడత, కాండంతొలుచు పురుగులు ఆశించాయని గుర్తించి నివారణ చర్యలు వివరించారు.

క్రీడలతో క్రమశిక్షణ.. ఏకాగ్రత



మాట్లాడుతున్న ఎంఈవో గోవిందయ్య

కావలి టౌన్, సెప్టెంబరు 18: క్రీడలతో క్రమశిక్షణతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని ఎంఈఓ గోవిందయ్య తెలిపారు. బుధవారం జడ్పీ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించి మండల జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. బాల్యదశనుంచే క్రీడా నైపుణ్యం పెంపొందించాలన్న దృక్పథంతో ఎస్‌జీఎఫ్ కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. జడ్పీ ప్రధానోపాధ్యాయురాలు నీరజ విజేతలను అభినందించారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24, 25తేదీల్లో కావలి జడ్పీ మైదానంలో జరుగనున్న నియోజకవర్గ స్థాయి ఎంపికలకు అర్హులన్నారు. కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

వింజమూరు, సెప్టెంబరు 18 : మండలంలోని చాకలికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు మొక్కల పంపిణీ

ఏఎస్ పేట, సెప్టెంబరు18: స్థానిక ఎంపీడీవో కార్యలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని 19 పంచాయతీలలో పంచాయతీకి 10 మొక్కలు చొప్పున అందించారు. వాటిని నాటి ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐటీఐలో సీట్లకు దరఖాస్తు చేసుకోండి

సంగం, సెప్టెంబరు 18: ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సంగం ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న ఫిట్టర్ ట్రేడ్‌లో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 28వ తేదీ 10గంటలకు జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

ఏఎస్ పేట, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆటల పోటీలను బుధవారం కావలి ఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎంఈవో సాయిప్రసాద్ ప్రారంభించారు. మండల స్థాయిలో అండర్-17, అండర్-14 విభాగాలలో ఆటల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు పాఠశాల హెచ్‌ఎంలు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు

సంగం, సెప్టెంబరు 18: తిరుమనకొండలోని కాశీవిశేశ్వరస్వామి జ్ఞాన పీఠంలో భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పీఠాధిపది రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు ధ్యాన, యోగ, ప్రాణాయములపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024



ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారికోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్‌ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్‌ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000 (పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https://ctet.nic.in/

దిక్సూచి

అడ్మిషన్స్

ఎన్‌ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్‌ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కోర్సు, సీట్లు: యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.

- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్‌ఎల్‌ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్‌ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్‌ఎల్‌ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/







జనరల్ నోటీసు

నా క్లయింటు అయిన **M/s. Piramal Capital & Housing Finance Ltd., Nellore Branch, rep.by its Branch Manager** అనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడ మేమనగా- నా క్లయింటుకు కస్టమర్ అయిన **శ్రీమతి చెర్కుల రాములు W/o. బ్రహ్మారెడ్డి,** వింజమూరు గ్రామం& మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అనువారు ఈక్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని తనఖా వుంచి ఋణసౌకర్యం పొందుటకు నా క్లయింట్‌ను సంప్రదించినారు. సదరు శ్రీమతి చెర్కుల రాములు గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **1. శ్రీ పెద్దేటి వెన్నకృష్ణ, 2. శ్రీ పెద్దేటి బాలకృష్ణ, 3. శ్రీమతి చెన్నమ్మ శ్రీరాములు, 4. శ్రీమతి పెద్దేటి నిర్మల గార్ల వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది:01-02-2020 డాక్యుమెంటు నెం.156/2020** ద్వారా కొనుగోలు చేసినారని మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికైనను ఎటువంటి ఆక్షేపణలు/ అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 14 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. లేనిచో నా క్లయింట్ శ్రీమతి చెర్కుల రాములు గారికి ఋణము మంజూరు చేసెదరు. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు డి. వింజమూరు సబ్.డి. వింజమూరు మండలం, వింజమూరు గ్రామ పంచాయతి, వింజమూరు గ్రామ 13వ బ్లాకు, డోరు నెంబరు 13/107 రు పరిధిలోని వింజమూరు గ్రామ సర్వే నెం. 588-4 రు ఎ:0-69సెంట్లలో ఎ 0-13సెం భూమిలోని రాబడి ప్లాట్లలో ప్లాటు నెం.79కు విస్తీర్ణం 41 అంకణములు 48 చదరపు అడుగులు లేక 333.33 చదరపు గజములు లేక 278.74 చదరపు మీటర్లు గల ఖాళీ స్థలమునకు **హద్దులు: తూర్పు:** ప్లాటు నెం.81 రు స్థలము, **దక్షిణం:** 30 అడుగుల వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, **పడమర:** 20 అడుగుల వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, **ఉత్తరం:** ప్లాటు నెం.80 రు స్థలము ఈ హద్దుల మధ్య గల పై తెలిపిన స్థలమున్నూ, మామూలు దారి హక్కులు యావత్ ఈజిమెంట్ హక్కులతోటి.

M.Mushtaq Ahmed, M.B.A., B.L., Advocate, D.No.23-1-957, Mulapet, Nellore-524003. Cell: 9441443110

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఎట్టకేలకు ఎన్టీఆర్ ఇళ్లకు మోక్షం

● బిల్లుల మంజూరుకు సర్వే ప్రారంభం

మర్రిపాడు, సెప్టెంబరు 18: గత టీడీపీ ప్రభుత్వం 2014లో పేదలకు ఎన్టీఆర్ ఇళ్లు మంజూరు చేసింది. మూడు విడతల్లో ఈ కార్యక్రమం జరిగింది. చివరి విడత ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండగానే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అసంపూర్తి ఇళ్లకు బిల్లులు ఇవ్వలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం రావటంతో ఎట్టకేలకు పెండింగ్ బిల్లులు మంజూరు కానున్నాయి.ఈ క్రమంలో హౌసింగ్ అధికారులు గ్రామాల్లోని ప్రతీ ఎన్టీఆర్ ఇంటి లబ్ధిదారుడి వద్దకు ఎంతవరకు నిర్మాణం చేపట్టారు. బిల్లులు మంజూరు అయ్యాయా.. లేదా... వంటి వివరాలను సేకరిస్తున్నారు. కాగా అంతకుముందు కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఆగినా, చంద్రబాబు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం మాత్రం కక్షసాధింపులకు పాల్పడింది. ఆత్మకూరు నియోజక వర్గంలోని మర్రిపాడులో 753, ఆత్మకూరులో 670, చేజర్లలో 623, సంగంలో 600, ఏఎస్‌పేటలో 432, అనంతసాగరంలో 692 ఎన్టీఆర్ ఇళ్లకు బిల్లులు రావాల్సి ఉంది.

నివేదిక పంపుతాం : హౌసింగ్ డీఈఈ

నియోజకవర్గంలో ఎన్టీఆర్ ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఎన్ని గృహాలకు బిల్లులు రాలేదు. పునాదులు వరకు నిర్మాణం చేపట్టినవి, ఎంతవరకు పూర్తయినవి తెలుసు కోమని ఆదేశాలు వచ్చాయి. సిబ్బందిని పంపించి సర్వే చేస్తున్నాం. నివేదికను జిల్లా అధికారు లకు పంపిస్తామని ఆత్మకూరు హౌసింగ్ డీఈఈ ముక్తార్‌బాషా తెలిపారు.



చుంచులూరులో సర్వే చేస్తున్న గృహనిర్మాణ శాఖ సిబ్బంది (ఫైల్)













రైసుమిల్లుల కాలుష్యం - రైతుల ఆందోళన


కాలుష్యాన్ని విడుదల చేస్తున్న రైస్ మిల్లు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 18: యజమానుల నిర్లక్ష్యం వల్ల రైసుమిల్లుల నుంచి కాలుష్యం వెదజల్లడంతో పంటలు పండక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా మండలంలోని ఇస్కపాలెం, సాలిపేట సెంటర్‌లోని రైసుమిల్లు నుంచి విడుదల అవుతున్న కాలుష్యపు నీటిని రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో ఆ భూముల్లో పంటలు పండడం లేదు అంతేకాక రైసు మిల్లు నుంచి దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రాఅండ్‌బాయిల్డ్ రైసుమిల్లులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారన్నది అర్థం కావడంలేదు. రైసు మిల్లుల యజమానుల నుంచి భారీగా ముడుపులు తీసుకుని, అనుమతులు మంజూరు చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు అయిన రైసుమిల్లులపై చర్యలు తీసుకుని తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు చంద్రబాబు బాటలు : ఎమ్మెల్యే

● నూతన భవనాల్లోకి గురుకులం విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, సెప్టెంబరు 18 : విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సీఎం చంద్రబాబు బాటలు వేశారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 31వ డివిజన్ అక్కచెరువుపాడు వద్ద గురుకుల పాఠశాల భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 టీడీపీ హయాంలో ఈ గురుకుల పాఠశాల నిర్మాణాలకు పునాదులు వేసి రూ.15 కోట్లతో నిర్మించేందుకు తీసుకోగా ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా రాల్చలేదని దుయ్యబట్టారు. యువగళం పాదయాత్రలో నెల్లూరుకు వచ్చిన నారా లోకేష్ ఇచ్చిన హామీ నెరవేరిందన్నారు. ముస్లిం మైనార్టీలతో పాటు, దళిత, గిరిజనుల విద్యార్థుల కోసం నిర్మించిన గురుకుల పాఠశాల భవనాల్లోకి విద్యార్థుల తరలింపు జరిగేందుకు బాటలు వేసిన ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తదుపరి నిర్మాణాలకు తనవంతు సాయంగా రూ.లక్ష, తన స్నేహితుడు సమాధి సతీష్ మరో రూ.లక్ష ఇస్తున్నామని ప్రకటించారు. దీంతో పాటు 19వ డివిజన్ కార్పొరేటర్ నూకరాజు జ్యోతిప్రియ దంపతులు 20 ఫ్యాన్లు, 31వ డివిజన్ కార్పొరేటర్ బత్తల మంజుల దంపతులు 30 ఫ్యాన్లు అందచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బత్తల కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీధర్‌రెడ్డిని 22వ డివిజన్ వైసీపీకి చెందిన కార్పొరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి కలిశారు. టీడీపీలో చేరేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

వాడవాడలా స్వచ్ఛతా హీ సేవ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 18: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని వాడవాడలా బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు మొక్కలు నాటారు. బుచ్చి నగర పంచాయతీ కమిషనర్ ఆధ్వర్యంలో బుచ్చి తహసీల్దారు కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం, పోలీస్‌స్టేషన్, డీఎల్ఎన్ఆర్ హైస్కూలు, తదితర ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు.


మొక్క నాటుతున్న జిల్లా సహకార శాఖ అధికారి

పెనుబల్లి గ్రామంలోని పాఠశాలల ఆవరణలతోపాటు పలుచోట్ల తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, సర్పంచు ఊడా పెంచలయ్య, సెక్రటరీ చలపతి, ఇతర నాయకులు, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కోఆపరేటివ్ క్రెడిట్ బ్యాంకులో జిల్లా సహకార శాఖాధికారి బి గురప్ప మొక్కలు నాటారు. అనంతరం కాలువల్లో వ్యర్థాలు తొలగించి పారిశుధ్యం మెరుగుపరిచారు. ఈకార్యక్రమంలో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ సుబ్రమణ్యం, సబ్ డివిజినల్ సహకార అధికారి కె సుభాషిణి, సంఘం సీఈఓ ఎం శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం సహకార గ్రామీణ వ్యవసాయ సంఘం సీఈఓ సురేష్‌రెడ్డి, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి


గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో

మనుబోలు, సెప్టెంబరు 18: రక్తహీనత లేకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఈ సమస్య రాకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మీ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లులు, కిశోర బాలికలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం తయారు చేసుకునే విధానాన్ని తెలిపారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, కార్యకర్తలు విజయ, సుగుణ, నిర్మల, సుజన. శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బుచ్చి ఎస్‌ఐగా సంతోష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 18: బుచ్చిరెడ్డిపాళెం ఎస్‌ఐగా సీ సంతోష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయన సీఐ శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

కాకాణి కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా

● టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు మస్తాన్‌బాబు

పొదలకూరు, సెప్టెంబరు 18: మండలంలోని విరువూరు రీచ్‌లో 2022-23లో ఇసుక అక్రమ రవాణా మాజీ మంత్రి కాకాణి కనుసన్నల్లోనే జరిగిందని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు విమర్శించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1.85 మెట్రిక్ టన్నుల ఇసుకను విరువూరు రీచ్ నుంచి తరలించారని, ఈ మేరకు మైనింగ్, ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. ప్రెస్‌మీట్లలో శ్రీరంగనీతులు చెప్పే మాజీ మంత్రి కాకాణి దీనికి సమాధానం ఏమి చెప్తారని ప్రశ్నించారు. ఒక్క ఏడాదిలోనే లక్షల మెట్రిక్ టన్నులు ఇసుకను బొక్కేసిన మాజీ మంత్రి అతని అనుచరులతో కలిసి 2019నుంచి ఎంత బొక్కేసి ఉంటారోనని ఆలోచించుకోవాలన్నారు. అతని ఇసుక దోపిడీ బయటపడకుండా ఉండేందుకు సూరాయపాలెంలో ఇసుక రీచ్ ప్రారంభం కాకముందే వందల కోట్లు దోపిడీ అంటూ కాకాణి అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమిరెడ్డి బాడీ లాంగ్వేజ్, శరీర ఆకృతిని గురించి కాకాణి నీచంగా తన స్థాయిని దిగజార్చుకునేలాగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పొదలకూరులో 50 అక్రమ లే అవుట్లు వెలిశాయని, వాటికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. తాము వాటిపైన దృష్టి పెట్టి నుడా, పంచాయతీకి రావాల్సిన మొత్తాలను చెల్లించేలాగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, జమీర్, దేవినేని శరత్, సుధాకర్‌నాయుడు, ఖాదర్‌బాషా, అలుపూరు శ్రీనివాసులు, కొంగి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

సోమిరెడ్డిపై నిందలా?

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 18 : దళితులకు పెద్దన్నగా, సర్వేపల్లి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై వైసీపీ నేతలు దళిత ద్రోహి అని నిందలు మోపడం దారుణమని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నావూరు శైలేంద్రబాబు, నగర అధ్యక్షుడు అరవ కిషోర్, నగర ప్రధాన కార్యదర్శి దానా మహేష్ ఇక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. దళితులపై దాడులు, అక్రమ కేసులు బనాయించి వారి మరణాలకు కారణమైన వైసీపీ ద్రోహులు చంద్రమోహన్‌రెడ్డిని విమర్శించడం ఏమిటని పేర్కొన్నారు.

నేడు యరగుడిపాటి జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 18 : నగరంలోని రంగనాథ స్వామి ఆలయ తూర్పు రాజగోపురం నిర్మాణదాత యరగుడిపాటి వెంకటాచలం పంతులు జయంతి వేడుకలు గురువారం జరుగుతాయని ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు రంగనాథస్వామికి చిత్రకూరం ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు, సెప్టెంబరు 18: పెంచలకోనలో పవిత్రోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీవార్లకు ఉదయం వేద, దివ్యప్రబంద పారాయణ, విశేష హోమాలు, శేషవాహనోత్సవం, స్నపన తిరుమంజనం, మహా పూర్ణాహుతి, నివేదన, తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణలతో భక్తిశ్రద్ధలతో నిర్వహిం నిర్వహించి నట్లు ఆలయ ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి కేవీ సాగర్‌బాబు తెలిపారు.

చప్పుడులేని 'సంచార లోక్‌అదాలత్'

● మూలనపడ్డ ఉచిత న్యాయ మొబైల్ వాహనాలు


మూలనపడ్డ ఉచిత న్యాయసేవలవాహనం

ప్రజల ముంగిటకే వెళ్లి న్యాయ సేవలను ఉచితంగా అందించడం కోసం సంచార లోక్‌అదాలత్ పేరుతో ప్రవేశపెట్టిన మొబైల్ వాహనాలు మూలన పడ్డాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఆ వాహనాలకు కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. జిల్లాకోర్టు ప్రాంగణంలో మరుగుదొడ్ల పక్కన దట్టంగా పెరిగిన చెట్ల వద్ద వదిలేశారు. ఈ వాహనాలు లేకపోవడంతో మొబైల్ న్యాయసేవలు కూడా ప్రజలు అందడం లేదనే ఆరోపణలున్నాయి.

- నెల్లూరు(హరనాథపురం)

వరద బాధితులకు రూ.1,50 లక్షల విరాళం


సీఎంకు చెక్కు అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 18 : విజయవాడ వరద బాధితులకు మేమున్నామంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పీరిగల నవీన్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాయక్, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ నాయకులు సుబ్బయ్యలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1.50 లక్షల చెక్కును మంగళవారం విజయవాడలో అందజేశారు.

'అవెన్యూస్' విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 18 : విజయవాడ వరదబాధితుల సహాయార్థం నగరంలోని అవెన్యూస్ పాఠశాల నిర్వాహకులు లక్ష రూపాయల విరాళానికి సంబంధించిన చెక్కును నగరంలో ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం పాఠశాల చైర్మన్ బాబునాయుడు, కరస్పాండెంట్ కృష్ణచైతన్యలు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అందచేశారు. తమ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు కలిపి రూ.50వేలు నగదు అందించగా, సామాజిక బాధ్యతతో తాము రూ.50వేలు కలిపి మొత్తం లక్ష రూపాయల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందచేశామని తెలిపారు.

'జనవాణి'కి విశేష ఆదరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 18: నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన జనవాణి కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వారి సమస్యలను జనసేన పార్టీ నాయకులు తెలియజేశారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కోఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్, జమీర్, వైరవి, గుడి హరిరెడ్డి , శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు కాలినడకన యాత్ర


తిరుమలకు కాలినడకన పయనమవుతున్న భక్తులు

పొదలకూరు, సెప్టెంబరు 18: స్థాని శ్రీనివాస లే అవుట్‌లో కొలువు దీరిన లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 101 మంది భక్తులు బుధవారం తిరుమలకు కాలినడకన బయలుదేరారు. తొలుతగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెండ్యాల రమణయ్యనాయుడు, శ్యామ్‌ప్రసాద్, చొప్ప వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అన్న సంతర్పణ

మనుబోలు, సెప్టెంబరు 18: స్థానిక వినాయక ఆలయం వద్ద బుధవారం యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో దుగ్గన జయబాలకృష్ణ భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఈ ప్రాంతంలో చవితిరోజు భారీ గణనాథుడిని కొలువుంచారు. 12రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించా రు. కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం) : భాద్రపద పౌర్ణమి సందర్భంగా మహాత్మాగాంధీ నగర్‌లోని కృష్ణ మందిరంలో బుధవారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. భక్తులకు అన్న ప్రసాద వితరణలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి


మినరల్స్ పంపిణీ చేస్తున్న ఏడీ డాక్టర్ నిర్మల

ముత్తుకూరు, సెప్టెంబరు 18: నేలటూరుపాలెంలో హీఫర్ ఇంటర్నేషనల్, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నిర్మల పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పాడి రైతుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. లింగ నిర్ధారణ వీర్యంపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు ఆరోగ్య పరీక్షలు, మందులు, మినరల్ మిక్చర్స్, కాల్షియం, లివర్ టానిక్స్, నట్టల మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు గోవర్ధన్, రాజ్యలక్ష్మీ, సరితా, శివశంకర్‌రెడ్డి, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అధికారులు నాగేశ్వరరావు, రూపేష్, మూర్తి, హైపర్ ఇంటర్నేషనల్ అధికారులు శ్యామ్ కట్ట, గణేష్, లోకనాథ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి : ఎంపీడీవో

నెల్లూరురూరల్, సెప్టెంబరు 18 : ప్రతి ఒక్కరు తమ జీవితాల్లోని ముఖ్యదినాలను గుర్తు చేసుకుంటు ఒక మొక్క నాటాలని నెల్లూరురూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులోని తమ కార్యాలయ ఆవరణంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలలో భాగంగా మొక్కలు నాటారు. గాడి తప్పుతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే మొక్కలు నాటి పచ్చదనం పెంచడమొక్కటే మార్గమన్నారు. నాటిన మొక్కలను పర్యవేక్షించుకుంటూ పెద్దవి చేస్తే అవే మనం బ్రతకడానికి ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఎంపీడీవో శైలేంద్రకుమార్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● చేనేత, జౌళి శాఖ ఏడీ వరప్రసాద్

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 18 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని చేనేత, జౌళిశాఖ ఏడీ వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట శేషయ్య, పద్మశాలి సంఘ ఉపాధ్యక్షుడు చింతలపూడి పెంచలయ్య, కార్యాలయ సిబ్బంది ప్రసాదరావు, రజిని, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు ఎస్‌ఐగా నరేష్‌కుమార్

విడవలూరు, సెప్టెంబరు 18: విడవలూరు ఎస్‌ఐగా నరేష్‌కుమార్ యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు ఎస్‌ఐని మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని, రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు.

వైసీపీ నగర ఇన్‌చార్జిగా పర్వతరెడ్డి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 18 : వైసీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసకున్నారన్నారు. పార్టీ అధ్యక్షుడు తనపై ఉన్న నమ్మకంతో ఇప్పటికే జిల్లా అధ్యక్షుడిగా, ప్రభుత్వ ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడిగా, తాజా నగర నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. వారి అంచనాలకు అనుగుణంగా పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు18: బుచ్చిరెడ్డిపాళెం పట్టణం సుబ్బారెడ్డినగర్‌లో బుధవారం పి.హైమావతమ్మ అనే మహిళ ఒంటరిగా పాలకోసం వెళ్లి రోడ్డుపై నడిచి వస్తుండగా ఓ గుర్తుతెలియని యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుని ఇరిగేషన్ బంగ్లా గోడ దూకి జాతీయ రహదారి వైపు పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ట్రాఫిక్‌ను నియంత్రించండి : కమిషనర్


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 18 : నెల్లూరులో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. బుధవారం తన ఛాంబరులో పోలీసు అధికారులతో ట్రాఫిక్ సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు నూతన విధానాలు అమలు చేయాలన్నారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద తగిన హెచ్చరికలు అమల్లోకి తీసుకురావాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలపై అవగాహన కల్పిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడపై లైటింగ్ పెంచేందుకు నివేదిక తయారు చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలలో భాగంగా 13, 20 డివిజన్లలో మొక్కలు నాటారు. ప్రజలంతా తమకు అనువైన ప్రాంతాలలో మొక్కలు నాటాలని కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 18: చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలోని కృష్ణచైతన్య కళాశాలలోని విద్యార్థులకు బుధవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళల రక్షణ తదితర చట్టాలపై ఇన్‌స్పెక్టర్ అవగాహన కల్పించారు. అత్యవసర వేళల్లో 100, 112లకు ఫోన్ చేస్తే తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు.

వీఎస్‌యూలో పిచ్చి మొక్కల తొలగింపు

వెంకటాచలం, సెప్టెంబరు 18: కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-4 సభ్యులు పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

వెంకటాచలం, సెప్టెంబరు 18 : వెంకటాచలంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి ఎద్దు ప్రసాద్ తన ఇంటి పక్కనే గడ్డివామి వేసుకొని ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సుమారు రూ.50 వేల నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపారు.

ఉచిత కేన్సర్ పరీక్షలు ప్రారంభం


కేన్సర్ పరీక్షలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కొడవలూరు, సెప్టెంబరు 18 : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఉచిత క్యాన్సర్ పరీక్షలను స్థానిక టీడీపీ నాయకులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్ రహిత నియోజకవర్గమే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న విపీఆర్ దంపతులను వారు కొనియాడారు. వారంరోజులు పాటు మండ లంలో నిర్వహించే ఈ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది, మండల పరిశీలకుడు ముంగమూరి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, జీవీఎన్ శేఖర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కోడూరు విజయ్‌కుమార్, శేషయ్య, జిలానీ, నాయబ్ పాల్గొన్నారు.





విజయవాడలో బుధవారం జరిగిన ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు తదితరులు


రూ.1213 కోట్ల పెట్టుబడులు

4060 ఉద్యోగాలు

- తొలి వంద రోజుల్లో ప్రభుత్వ నిర్ణయాలతో జిల్లాకు లబ్ధి

కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి వంద రోజులు అవుతోంది. కొత్త ప్రభుత్వ పాలనలో జిల్లాకు ఒనగూరింది ఏమిటి అని పరిశీలించడానికి వంద రోజులు అన్నది అత్యంత స్వల్ప సమయం. నిజానికి ఇంత స్వల్ప వ్యవధిలోనూ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాకు భారీ లబ్ధి కలిగిందనే చెప్పాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



జిల్లాలో గత నెల 19వ తేదీన పర్యటించిన సీఎం చంద్రబాబు శ్రీసిటీలో రూ.1570 కోట్ల పెట్టుబడులతో 16 పరిశ్రమలు ప్రారంభించారు. వీటి ద్వారా 8680 ఉద్యోగాలు యువతకు లభించాయి. మరో రూ.900 కోట్ల పెట్టుబడులతో ఎనిమిది పరిశ్రమల నిర్మాణానికి భూమి పూజ చేశారు. వీటి ద్వారా మరో 2760 ఉద్యోగాలు జిల్లాకు రానున్నాయి. వీటికి భూముల కేటాయింపు, ఇతరత్రా అనుమతుల ప్రక్రియ గత ప్రభుత్వ హయాంలోనే మొదలు కావడం వల్ల వాటిని పరిగణనలోకి తీసుకోకపోయినా సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో కొత్తగా రూ.1213 కోట్ల పెట్టుబడులతో ఐదు పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు కుదుర్చుకోవడం మాత్రం కూటమి ప్రభుత్వ పాలనలో జిల్లాకు ఒనగూరిన తొలి ప్రయోజనంగా భావించాల్సి వుంది. నిజానికి ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి 69 రోజులు మాత్రమే గడిచింది. ఆ స్వల్ప వ్యవధిలోనే జిల్లాకు భారీగా ప్రయోజనాలు కలిగించడంలో సీఎం చంద్రబాబు సఫలీకృతులయ్యారు.



ఆగస్టు 19వ తేదీన శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటుపై ఒప్పందం కుదుర్చుకుంటున్న సీఎం చంద్రబాబు

ఎంవోయూలు కుదుర్చుకున్న పరిశ్రమలు

పరిశ్రమ	దేశం	పెట్టుబడి	ఉద్యోగాలు
ఆర్మ్‌వెస్ట్ మిరైటెక్ ఇండియా	సింగపూర్	రూ. 40 కోట్లు	500
ఎక్సెలెంట్ ఫార్మా	ఇండియా	రూ. 150 కోట్లు	500
క్యాప్‌మ్యాన్ ఇండియా	యూఏఈ	రూ. 20 కోట్లు	50
డైకిన్	జపాన్	రూ. 1000 కోట్లు	3000
ప్రెస్టైజ్ ఇంటర్నేషనల్	జపాన్	రూ. 3 కోట్లు	10
మొత్తం		రూ. 1213 కోట్లు	4060

2.71 లక్షల మందికి పింఛను పెంపు



జిల్లావ్యాప్తంగా 2.71 లక్షల మంది పేద వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ప్రభుత్వం నుంచీ సామాజిక భద్రతా పెన్షన్లు పొందుతున్నారు.2014కు ముందు వీరికి నెలవారీ కేవలం రూ.200 మాత్రమే పెన్షన్ వచ్చేది. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పెన్షన్ మొత్తాన్ని ఒకేసారి రూ.2 వేలకు పెంచారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం తొలి ఏడాది మినహాయించి తదుపరి నాలుగేళ్లలో ఏడాదికి రూ. 250 చొప్పున పెంచుతూ వచ్చి.. ఎన్నికల ఏడాదిలో రూ.3 వేలు చేసింది. ఇటీవలి ఎన్నికల్లో చంద్రబాబు తమ ప్రభుత్వం ఏర్పడితే నెలవారీ పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆయన సీఎం హోదాలో తొలి సంతకం పెన్షన్ పెంపు ఫైల్‌పై చేశారు. దీనివల్ల జిల్లాలోని 2.71 లక్షల మంది పేద లబ్ధిదారులకు నెలకు రూ.27.41 కోట్ల చొప్పున అదనపు లబ్ధి కలుగుతోంది. తొలి వందరోజులను పరిగణనలోకి తీసుకుంటే కూటమి ప్రభుత్వ ఏర్పాటు కారణంగా 2.71 లక్షల మందికి మూడు నెలల్లో రూ. 82.23 కోట్లు అదనంగా లబ్ధి చేకూరింది.

పీహెచ్‌సీల్లో ఆగిన ఓపీ



ఉదయం 9 గంటలకు మూసి ఉన్న అత్తివరం పీహెచ్‌సీ

నాయుడుపేట, సెప్టెంబరు 18: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) బుధవారం ఓపీ సేవలు ఆగాయి. కొన్ని రోజులుగా వైద్యులు చేపట్టిన ఆందోళనలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. పలువురు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. ప్రభుత్వ వైద్యుల పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ఇస్తున్న రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుదిస్తూ జీవో జారీ చేసింది. దీనికి నిరసనగా ఆందోళనకు దిగిన వైద్యులు బుధవారం ఓపీ సేవలను నిలిపివేశారు.



గరుడ వాహనంపై మలయప్పస్వామిని దర్శించుకోవడానికి తరలి వచ్చిన భక్తజనం



తిరుమలలో మాదిరి గరుడసేవ

తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అక్టోబరు 4 నుంచి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మాదిరి గరుడ సేవ నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున మలయప్పస్వామికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు పౌర్ణమి రోజున మాదిరి గరుడ సేవ నిర్వహించడం పరిపాటి. తద్వారా బ్రహ్మోత్సవ ఏర్పాట్లను అధికారులు సమీక్షించుకుంటారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన గరుడసేవలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ కలిసి నాలుగు మాడవీధుల్లో భద్రత, తాగునీరు పంపిణీ, అన్నప్రసాదాల వితరణ, శ్రీవారిసేవకుల సేవలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, ఇతర ఇంజినీరింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. గరుడ వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భజనబృందాలు ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు నడుమ పౌర్ణమి గరుడసేవ కన్నుల పండువ గా జరిగింది. గరుడ వాహనసేవలో భక్తులు భారీగా పాల్గొని కర్పూర హారతులు పడుతూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకున్నారు.



వాహన సేవ సందర్భంగా సూచనలు చేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు



హారతులిస్తున్న భక్తులు

సీఎం సహాయనిధికి రూ.84.50 లక్షలు



మెగా చెక్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి జిల్లా నుంచి రూ.84,50,193 అందించినట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ మెగా చెక్కును బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి.. మీడియాతో మాట్లాడారు. తన జీతంలో సగాన్ని విరాళంగా అందించానన్నారు. ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని ఇచ్చారని, మళ్లీ అన్ని ప్రభుత్వ శాఖలు విడివిడిగానూ విరాళాలు ఇచ్చినట్లు వివరించారు. జిల్లాలోని శ్రీసిటీ, శ్రీకాళహస్తి ఎలక్ట్రోస్టీల్, అపోలో టైర్స్, ప్రైవేటు స్కూల్స్ ఎడిఫై, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, వేదవ్యాస సమాజం, విశ్రాంత ఉద్యోగులు, వ్యక్తులు స్పందించి విరాళాలను అందజేశారన్నారు. ఇలా ఇప్పటి వరకు రూ.84,50,193 సీఎం సహాయ నిధికి అందినట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే రూ.24,30,500 విలువజేసే వాటర్ బాటిళ్లు, టెట్రా పాలప్యాకెట్లు, బిస్కెట్లు, క్యాండిల్స్, అగ్గిపెట్టెలు తదితరాలను రెండు వారాలముందే పంపించామన్నారు. ఇక నారాయణ విద్యాసంస్థల నుంచి రూ.27 లక్షలతో పాటు మరో రూ.33 లక్షలు ఈరోజు సీఎం సహాయ నిధికి జమ చేయనున్నట్టు వెల్లడించారు. విరాళదాతలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. డీపీఆర్వో బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విరివిగా సాయం అందించండి

దాతలు మరింత విరివిగా సాయం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. చెక్కు లేదా అకౌంట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా విరాళాలను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ తిరుపతి.. సీఎంఆర్ఎఫ్ పేరున ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0823066, అకౌంట్ నంబరు 230612010000689కు విరాళాలను పంపాలని దాతలకు సూచించారు.



నాయకులు, ప్రజలు, వివిధ సంస్థల నిర్వాహకులు అందించిన రూ.6,38,435 చెక్కును బుధవారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌కు అందిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



సుధా సోమెనీ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు అందించిన రూ.5 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు ఇస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

నారాయణ విద్యార్థుల విరాళం రూ.27,01,760



చెక్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న కొండలరావు, విద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18: ఉమ్మడి చిత్తూరు జిల్లా నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.27,01,760 అందించారు. ఈ చెక్‌ను ఆ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. నారాయణ విద్యా సంస్థల తిరుపతి ఏజీఎం డాక్టర్ ఎ.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ డీన్ ఏఎస్ రావు, ఇతర డీన్లు, ఏజీఎంలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయంలో కట్ చేసిన క్యూలైన్ల ఏర్పాటు

- గుట్టు చప్పుడు కాకుండా పనులు చేయించిన వైసీపీ నేత

నాగలాపురం, సెప్టెంబరు 18: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో గత ఆదివారం ఆలయ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత ఏవీఎం బాలాజీరెడ్డి కుమార్తె నిశ్చితార్థం సందర్భంగా స్టీల్ క్యూలైన్లను కట్ చేశారు. దాతల సాయంతో ప్రదోష మండపం వద్ద ఈ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. నిశ్చితార్థ వేడుకలు బంధుమిత్రులకు కనిపించేందుకని వీటిని తొలగించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడటంతో ఆయన ఉలిక్కి పడ్డారు. తమిళనాడు నుంచి వెల్డర్లను పిలిపించి బుధవారం మధ్యాహ్నం ఆలయానికి పంపి క్యూలైన్లను అదే స్థానంలో యథావిధిగా పెట్టి వెల్డింగ్ చేయించారు. గుట్టు చప్పుడు కాకుండా ఈ పనులు పూర్తి చేశారు.



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఎస్ఎస్ పురం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

నాగలాపురం, సెప్టెంబరు 18: రూ.వంద ఇస్తేనే మస్టర్ వేస్తానంటూ ఉపాధికూలీల వద్ద డబ్బు డిమాండు చేసిన ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకుడు మాధవ్‌పై అధికారులు విచారించారు. నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురానికి చెందిన ఈయన కూలీల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్న వీడియో ఆధారంగా బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు దీనిపై ఎంపీడీవో బాబు, ఏపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రోజా విచారణ జరిపారు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తున్నామని చెప్పారు.

బంగారుపాళ్యంలో నేడు, రేపు మంత్రి లోకేశ్ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: రాష్ట్ర నారా లోకేష్ గురు, శుక్రవారాల్లో చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయం నుంచి బయల్దేరి రాత్రి 8.30 గంటలకు బంగారుపాళ్యం చేరుకుని బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కిడ్నీ డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడ ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు బంగారుపాళ్యం నుంచి రోడ్డుమార్గాన తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన అమ్మవారి పవిత్రోత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 18: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం మహా పూర్ణాహుతితో ముగిశాయి.మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, శాంతిహోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. సాయంత్రం వరకు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారితో పాటు శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించి, పద్మ పుష్కరిణిలో చక్రస్నానం చేపట్టారు. రాత్రి శ్రీకృష్ణస్వామి, సుందరరాజస్వామి, పద్మావతి అమ్మవారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు, జేఈవో గౌతమి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్, శేషగిరి అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుబాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



పద్మసరోవరంలో చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తున్న అర్చకులు

ఉరేసుకుని విజయనగరం జిల్లావాసి ఆత్మహత్య

పెళ్లకూరు, సెప్టెంబరు 18: ఉరేసుకుని విజయనగరం జిల్లావాసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు రాజుపాలెం అటవీ ప్రాంతంలో బుధవారం జరిగింది. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు కథనం మేరకు... విజయనగరం జిల్లా నర్సీపురం ప్రాంతానికి చెందిన గంగునాయుడు కుమారుడు చంద్రశేఖర్(40) కొంత కాలంగా నాయుడుపేట - రేణిగుంట మధ్య హైవే పనులు చేస్తున్న ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల భార్యభర్తల మధ్య వివాదం జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో చంద్రశేఖర్ ప్రతిరోజు ఫోన్లో భార్యతో మాట్లాడుతూ గొడవ పడేవాడని ఆయనతో పనిచేసే కార్మికులు వెల్లడించారు. ఈ క్రమంలో మద్యం ఎక్కువగా సేవిస్తూ విధులకు సక్రమంగా వెళ్లడం లేదని చెప్పారు. రాజుపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో వేప చెట్టుకు ఉరివేసుకొని మృతి చెంది ఉండడాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సంగమేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మునస్వామి తెలిపారు.

చెంగాళమ్మ ఆలయంలో మహా చండీయాగం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 18: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో బుధవారం మహా చండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని నిర్వహించారు. సూళ్లూరుపేటకు చెందిన బైరి పార్థసారథ రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు అన్న క్యాంటీన్ల ప్రారంభం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 18: సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధిలోని స్త్రీ స్వశక్తి భవనం ఎదురుగా అన్న క్యాంటీన్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ నారాయణ రెడ్డి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్‌లను మూసివేయడంతో ఆ భవనంలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భవనానికి మరమ్మతులు చేసి అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధం చేశారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక గురువారం ప్రారంభిస్తారని కమిషనర్ జనార్దనరెడ్డి తెలిపారు.

గూడూరు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో అన్న క్యాంటీన్‌ను గురువారం సాయంత్రం 7గంటలకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా



పోస్టాఫీసు వద్ద ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

గూడూరు, సెప్టెంబరు 18: స్థానిక ప్రధాన పోస్టాఫీసు వద్ద బుధవారం పోస్టల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సిబ్బందికి ఆచరణ సాధ్యం కాని టార్గెట్‌లు ఇస్తూ అధికారులు చేస్తున్న వేధింపులను వ్యతిరేకిస్తూ ధర్నా చేపట్టామన్నారు. ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయకపోవడం, గ్రేడింగ్ స్థాయి తగ్గిస్తామని బెదిరింపులకు పాల్పడడాన్ని ఖండిస్తున్నామ న్నారు. టార్గెట్‌లకు యూనియన్ వ్యతిరేకం కాదని, అయితే టార్గెట్‌లు యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలన్నారు.కార్యక్రమంలో గోవిందనాయక్, సీఎస్‌రాజు, పాండురంగారావు, శ్రావణ్‌కుమార్, మల్లికార్జున, పెంచలయ్య, చంద్రశేఖర్, గోపాల్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 18: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ నెల్లూరు, కళాశాల సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్స్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌సీసీ వలంటీర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఏడుకొండలు, శ్రీనివాసులు, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, రాజా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 18: పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరి అని మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ పీఎంవీ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మన్నారుపోలూరులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు మన ప్రాంతాలను మనమే శుభ్రంగా పెట్టుకోవాలని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హేచరీలో తనిఖీలు

కోట, సెప్టెంబరు 18: మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రంలోని విజయా సీఫుడ్స్ హేచరీలో బుధవారం మత్స్యశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. కోస్టల్ ఆక్వా అథారిటీ డైరెక్టర్ డాక్టర్ శంకర్‌రావు, మత్స్యశాఖ జిల్లా డీఎఫ్‌వో నాగరాజు, ఆక్వా శాస్త్రవేత్త డాక్టర్ పూర్ణిమ, ఎఫ్‌డీవో రెడ్డినాయక్, పలువురు ఏడీలు తనిఖీలు చేశారు. ఈ హేచరీ మూతపడి ఉండటంతో మళ్లీ ప్రారంభించేందుకు అవకాశాలను పరిశీలించారు. అనంతరం కోటలోని పలు ఆక్వా కెమికల్స్ దుకాణాలను తనిఖీ చేశారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

వెంకటగిరి, సెప్టెంబరు 18: వెంకటగిరి పట్టణంలోని బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలను సీఐ ఏవీ రమణ బుధవారం తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై నిర్వహకులకు సూచనలిచ్చారు.

హెచ్ఐవీపై అవగాహన

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 18: నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విశ్వోదయ జూనియర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన బుధవారం కల్పించారు. ఏఎన్ఎం కవిత మాట్లాడుతూ ఎయిడ్స్ సోకిన వారి పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా కలిసి జీవించాలన్నారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఓజిలి, సెప్టెంబర్ 18: ఓజిలి మండలం పెద్దపరియ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు గూడూరు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నట్లు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందింది. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఆస్పత్రికి తరలించారు.

నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కాకాణి



నెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. బుధవారం సాయంత్రం తాడేపల్లిలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ నాయకులతో జగన్ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కాకాణి మూడోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినట్లు అయింది.

వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ చోరీ

డక్కిలి, సెప్టెబరు 18: డక్కిలిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని పగల కొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. డక్కిలిలోని జాతీయ రహదారికి ఆనుకొని వున్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ప్రవేశించారు. హుండీని ఎత్తుకెళ్లి కొంతదూరంలో తాళం పగల కొట్టి అందులోని నగదు తీసుకెళ్లారు. ఉదయం నిర్వాహకులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ.1.50లక్షలు నగదు ఉంటుందని తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ శివశంకర్ క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయనిధికి విరాళాలు



నెలవల సుబ్రహ్మణ్యానికి చెక్కును అందజేస్తున్న రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి సూళ్లూరుపేట, నాయుడుపేట రైసు మిల్లుల అసోసియేషన్ నాయకులు రూ.5 లక్షల చెక్కును టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యానికి అందజేశారు. అలాగే నాయుడుపేట ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకులు రూ.లక్ష చెక్కు అందజేశారు.

గూడూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి పలువురు దాతలు బుధవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు చెక్కులు అందజేశారు. పట్టణానికి చెందిన సాయి రూ.10వేలు, చిల్లకూరు మండలం ఎగువరాజుపాళెం గ్రామానికి చెందిన శివశంకర్ రాజు రూ.5వేలు చెక్కులు అందజేశారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కోట, సెప్టెంబరు 18: మండల పరిధిలోని చిట్టేడులో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద రూ.41 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కోట, సెప్టెంబరు 18: కోట పట్టణ పరిధిలోని క్రాస్ రోడ్డులో బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొని తల్లం శ్రీనివాసులు అనే కార్పెంటర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్రాస్‌రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న శ్రీనివాసులును ఓ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన బస్సు కార్మికులతో వాకాడు వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులును స్థానికులు 108వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అన్నదానం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 18: మాజీ ఎంపీ వరప్రసాదరావు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద మాజీ ఎంపీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వినేష్ యాదవ్, పురుషోత్తంరెడ్డి, బాలకృష్ణమ నాయుడు, దయాకర్, మన్నెం శీనయ్య, వెంకటేశ్వర్లు, రమణయ్య, లక్ష్మీ, భవానీ, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 18: స్థానిక ఏపరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 20, 21వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడాపోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు సనత్‌కుమార్, కాంచన బుధవారం తెలిపారు. అథెలిటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు సమన్వయకర్తగా పీఈటీ కరీముల్లా ఖాన్ వ్యవహరిస్తారని, వివరాలకు 9440151663 నంబరును సంప్రదించాలని సూచించారు.

వెంకటగిరి టౌన్: మండల స్థాయి క్రీడా పోటీలు ఈనెల 20,21 తేదీల్లో స్థానిక ఏపీఆర్ఎస్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈవాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాట్మింటన్, యోగా, చెస్ పోటీలు ఉంటాయన్నారు.

తెలుగు యువత నేత జన్మదిన వేడుకలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18: తెలుగు యువత నాయకుడు పాదర్తి ప్రకాష్ నాయుడు జన్మదిన వేడుకలు పట్టణంలోని రామకృష్ణపురంలో బుధవారం రాత్రి కోలాహలంగా నిర్వహించారు. టీడీపీ నేత నెలవల రాజేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. టీడీపీ నాయకులు విజయ కుమార్ నాయుడు, రాజేంద్రప్రసాద్, ప్రసాద్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, కార్తీక్ రాజ్, నిరంజన్, ఆలీ, ప్రభాకర్ నాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్ నాయుడికి కేక్ తినిపిస్తున్న నెలవల రాజేష్



తడ పీహెచ్‌సీలో వైద్యుడు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ - నాయుడుపేటలోని తుమ్మూరు అర్బన్ పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేక మందులు ఇస్తున్న స్టాఫ్ నర్సు - ఓజిలి మండలంలోని అత్తివరం పీహెచ్‌సీలో సిబ్బంది రాకపోవడంతో నిరీక్షిస్తున్న రోగులు

సమ్మెలోకి ప్రభుత్వ వైద్యులు

- ఓపీ సేవలు లేక రోగుల ఇబ్బందులు
- సిబ్బంది అరకొర సేవలు

నాయుడుపేట, సెప్టెంబరు 18: ప్రభుత్వ వైద్యులు సమ్మె చేస్తున్నారు... ఈ విషయం తెలియక వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చిన రోగులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ప్రభుత్వ వైద్యులకు పోస్టు గాడ్యుయేషన్ ప్రవేశాల్లో ఇస్తున్న రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుదించింది. ఆ మేరకు రిజర్వేషన్ల కోటా తగ్గిస్తూ జీవో నెంబరు 85 విడుదల చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వైద్యులు నిరసన తెలుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం పిలుపు మేరకు మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఇందులో భాగంగా బుధవారం అన్ని వైద్యశాలల్లో ఓపీ సేవలను సైతం నిలిపివేశారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న పీహెచ్‌సీలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో వైద్యుల గదులన్నీ ఖాళీగా కనిపించాయి. కొన్నిచోట్ల డాక్టర్లు లేకపోవడంతో రోగులు నిరాశతో వెనుతిరిగి వెళ్లారు. కొన్నిచోట్ల సిబ్బందే రోగులకు మందులు అందించారు. అసలే సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు జనం ప్రభుత్వ వైద్యులు సమ్మెలో ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

నాయుడుపేట: తుమ్మూరు అర్బన్ పీహెచ్‌సీలో ఉదయం 9 గంటలకు ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు మాత్రమే వచ్చారు. డాక్టర్, ఫార్మసిస్టు లేకపోవడంతో స్టాఫ్ నర్సు రోగులను పరీక్షించి వారికి మందులు అందజేశారు.

తడ: స్థానిక పీహెచ్‌సీలో డాక్టరు రాకపోవడంతో అక్కడి సిబ్బందే రోగులకు వైద్యం అందించారు.

ఓజిలి: మండలంలోని అత్తివరం పీహెచ్‌సీ ఉదయం 9.15 గంటలకు కూడా తెరుచుకోలేదు. వైద్యం కోసం వచ్చిన రోగులు ఎదురుచూడాల్సి వచ్చింది. తరువాత స్వీపర్, ఫార్మసిస్టు ఏఎన్ఎం, ఎంఎన్‌వో హాజరయ్యారు.

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండగా, ఒకరు సకాలంలో విధులకు హాజరుకాగా మరొకరు గైర్హాజరయ్యారు. పెళ్లకూరు పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు మాత్రమే విధులకు వచ్చారు. పెళ్లకూరు, చెంబేడు పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టులు సకాలంలో విధులకు వచ్చారు.

సూళ్లూరుపేట: మన్నారుపోలూరు అర్బన్ పీహెచ్‌సీలో ఉదయం 10 గంటల వరకు వైద్యులు రాలేదు. స్టాఫ్ నర్సు, హెల్త్ అసిస్టెంట్ వచ్చారు. వైద్య సిబ్బంది రోగులకు మందులు అందజేశారు.

దొరవారిసత్రం: మండలంలోని తొగరాముడి పీహెచ్‌సీ సముద్రతీర ప్రాంతంలో ఉండటంతో అక్కడ కాల్ డ్యూటీ వైద్యసేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీని ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు మూసివేసి సిబ్బంది వెళ్లిపోతున్నారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు

వైద్యులు సమ్మెలో ఉన్న కారణంగా రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రుల్లో ఇతర సిబ్బంది రోగులకు అవసరమైన సేవలు అందించాలి. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసులురెడ్డి

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం



మల్లాం వీధుల్లో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి - రథం ముందు పొలి టెంకాయలు కొడుతున్న భక్తులు

చిట్టమూరు, సెప్టెంబర్ 18: మండలంలోని మల్లాంలో జరుగుతున్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం రథోత్సవం వైభవంగా సాగింది. వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించిన తేరుపై కొలువుదీర్చి మల్లాం పురవీధుల్లోకి ఊరేగించారు. హరోం... హర... అంటూ షణ్ముకుని తలుస్తూ భక్తులు రథాన్ని లాగారు. భక్తులు మిరియాలు, ఉప్పు రథంపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు... అలాగే రథం ముందు వందల సంఖ్యలో పొలిటెంకాయలు కొట్టారు. రథోత్సవానికి భక్తులు భారీసంఖ్యలో రావడంతో వాకాడు సీఐ హుస్సేన్ భాషా, చిట్టమూరు, వాకాడు, కోట ఎస్ఐలు చిన్న బలరామయ్య, నాగబాబు పవన్‌కుమార్ సిబ్బందితో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. మల్లాం యూత్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, శీతల పానియాలు, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చెంచుకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో నేడు షణ్ముకస్వామి కల్యాణ మహోత్సవం జరుగనుంది.

పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న మట్టం శ్రావణి

గూడూరు, సెప్టెంబరు 18: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేసి కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదాలను రోడ్లపై వేయకుండా కుండీల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో హేమంత్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాసులు, నాగేంద్ర, చంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మాళవ్యానగర్‌లోని సచివాలయంలో మాజీ కౌన్సిలర్లు ఇశ్రాయిల్ కుమార్, బిల్లు చెంచురామయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ గ్రామసభను నిర్వహించారు.

చిల్లకూరు: మండలంలోని బూదనం పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని చెత్తదిబ్బలను తొలగించడంతో పాటు, కాలువలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ మాణిక్యం, సర్పంచు నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

వెంకటగిరి, సెప్టెంబరు 18: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ ఏవీ రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐఐహెచ్‌టీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి, వాటిని ఎలా గుర్తించి నియంత్రించాలి, పోలీసులను ఆశ్రయించాల్సి విధానాలు, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పోషకవిలువలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గూడూరు అర్బన్, సెప్టెంబరు 18: చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో మెహబూబీ అన్నారు. బుధవారం స్థానిక విఘ్నేశ్వరపురం, కుమ్మరవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, కార్యకర్త చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని కడివేడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఏసీడీపీవో జ్యోతికిరణ్ బాలింతలకు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, పద్మావతి, సుగుణ, భారతి, రాధమ్మ, దేవసేనమ్మ తదిరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ వైద్యఖర్చులకు ఆర్థికసాయం

గూడూరు, సెప్టెంబరు 18: స్థానిక బనిగిసాహెబ్‌పేటకు చెందిన ఆటోడ్రైవర్ మున్నా కుటుంబసభ్యులకు బుధవారం ఆటో కార్మికులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణయ్య మాట్లాడుతూ ఆటో డ్రైవర్ మున్నా నాలుగు నెలలుగా అనారోగ్యానికి లోనై మంచం మీదనుంచి కదలలేని స్థితిలో ఉన్నాడన్నారు. అతని వైద్యఖర్చుల నిమిత్తం యూనియన్ ఆధ్వర్యంలో రూ.5,200 అందజేశామన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రఘు, మున్నా, శేఖరయ్య, హుసేన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

కోట, సెప్టెంబరు 18: వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు చేపడుతామని ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి అన్నారు. బుధవారం మండలంలోని విద్యానగర్, చిట్టేడు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా ఆటోల్లో అధికంగా ప్రయాణికులను తరలిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాకాడు మండలం జాంగ్రపేట వద్ద మంగళవారం విద్యార్థులతో ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడిన సంఘటనలో పది మంది గాయపడడం జరిగిందన్నారు. ఎక్కువ మంది ప్రయాణికులతో రవాణా సాగించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పనిసరిగా నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలన్నారు. కార్యక్రమంలో శీను, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ గోను రాజశేఖర్

డక్కిలి, సెప్టెంబరు 18: క్రీడలు వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని ఎంపీపీ గోను రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక బాలయోగి గురుకుల కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. అంతే కాకుండా క్రీడలు విద్యార్థులకు చక్కటి నడవడిక నేర్పుతాయన్నారు. బుధవారం నిర్వహించిన అండర్ 17 క్రీడా పోటీల్లో 800 మీటర్లు బాలుర విభాగంలో మునిచరణ్, మునీంద్ర(జడ్పీ హైస్కూలు, తీర్థంపాడు) ప్రథమ, ద్వితీయ స్థానాలు, వడ్డిపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థి హరి తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే బాలికల విభాగంలో బి.సునీత(డక్కిలి గురుకులం), పావని(గురుకులం), సింధు(డక్కిలి జడ్పీహెచ్ఎస్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. ఇక వంద మీటర్లు పరుగు పందెంలో చెంచుకృష్ణ, పెంచలయ్య, శశిధర్ విజయం సాధించగా, బాలికలు విభాగంలో సచిత, జ్యోతి, గురులక్ష్మి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీప్రసన్న కుమారి, ఎంఈవో పిన్నక జగదీష్ బాబు, పీఈటీ వెంకటయ్య, డక్కిలి హైస్కూల్ విద్యాకమిటీ ఛైర్మన్ దండవోలు వెంకటరమణారెడ్డి, బాలయోగి గురుకుల పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ రత్నయ్య, స్థానిక టీడీపీ నాయకులు డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 18: పట్టణంలోని బంగారుపేటలో వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.... గూడూరు నుంచి రాజేశ్వరమ్మ, ఆమె కుమారుడు ద్విచక్ర వాహనంలో వెంకటగిరికి వెళ్తుండగా బంగారుపేటలో వద్ద పెద్ద గుంతను తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తల్లి కుమారుడికి తీవ్ర గాయాలవడంతో వారిని వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలేరమ్మ జాతర రెండవ చాటింపు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 18: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు రెండవ చాటింపు బుధవారం అర్ధరాత్రి సంప్రదాయ బద్ధంగా జరిగింది. పట్టణంలోని గాలిగంగు దేవస్థానం వద్ద జాతర నిర్వహకులు, దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం ఆసాదుల తప్పెట్లు మోతలు, కేరింతల మధ్య ఈనెల 25, 26వ తేదీల్లో పోలేరమ్మ జాతర జరుగుతుందని చాటింపువేశారు. కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం ఈవో శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

కోట, సెప్టెంబరు 18: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న గాయత్రి ఈ నెల 7నుంచి 17వ తేదీ వరకు కేరళలో జరిగిన జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్ కల్చరల్ విభాగంలో ప్రతిభ చూపి ప్రసంశాపత్రాలు అందుకున్నారు. బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ నారాయణరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక

కోట, సెప్టెంబరు 18: ఎస్సీ వర్గీకరణ ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యతిరేక పోరాట సమితిని బుధవారం కోట పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మీజూరు మాధవ్, ప్రధాన కార్యదర్శిగా బందిల రంగనాథ్, కార్యదర్శిగా పారా మల్లికార్జున్, వసంత్, లీగల్ అడ్వైజర్‌గా దాసరి అశోక్‌కాంబ్లే, ఉపాధ్యక్షులుగా పనబాక హేమంత్, పసల చిరంజీవులను ఎన్నుకున్నారు. అలాగే గౌరవ సలహాదారుగా డాక్టర్ రామకృష్ణరావు, కృష్ణయ్య, దాసరి సుందరం ఎన్నికయ్యారు.

కోటమ్మ ఆలయంలో పౌర్ణమి హోమం



హోమాలు చేస్తున్న వేదపండితులు

కోట, సెప్టెంబరు 18: కోటలోని గ్రామదేవత కోటమ్మ ఆలయంలో బాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం లలితా హోమాలు జరిగాయి. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు జరిగాయి.